

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
13 అక్టోబర్ 2025 పేజీలు : 08 సోమవారం


## ఇళ్ల నిర్మాణం అడ్డుకుంటే
# ప్రతిఘటిస్తాం

**కాకాణి గోవర్ధన్ రెడ్డి**



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :**

వెంకటాచలం మండలం చవటపాళెం గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి పేదల ఇళ్ల నిర్మాణం అడ్డుకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. పేదల కోసం ప్రభుత్వం పారదర్శకంగా లేఔట్లు వేసి, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించిందని ఆయన తెలిపారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేసి, తెలుగుదేశం పార్టీ నేతల అనుచరులకు అప్పగించే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కోట్ల రూపాయల విలువ చేసే భూములను పేదల ఇళ్ల నిర్మాణం కోసం పంచిపెట్టామని, కానీ తెలుగుదేశం నాయకులు పేదల హక్కులను హరించేందుకు దుష్ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన పేదల ఇళ్ల స్థలాలపై ఎవరైనా జోక్యం చేసుకుంటే, అధికారులు కూడా మూల్యం చెల్లించక తప్పదని -మిగతా 2లో




## గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపుల
# జోరు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

ఆత్మకూరు ప్రాంతంలోని గ్రామాల్లో పరిశీలిస్తుంటే మద్యం బెల్ట్‌షాపుల జోరు హుషారుగా కన్పిస్తున్నాయి. నాలుగైదు రోజులుగా 'మేజర్‌న్యూస్' గ్రామాల్లో పరిశీలిస్తుంటే.. జనాల నుండి తమ గ్రామాల్లో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, తమ గ్రామంలో ఐదు మందని ఒకరంటే, తమ గ్రామంలో నలుగురు, తమ గ్రామంలో ఇద్దరు అమ్ముతున్నారని చెబుతున్నారు. మండలంలోని చెర్లోయడవల్లి గ్రామంలో మాత్రం తద్భిన్నంగా చెప్పారు. ఆ గ్రామంలో ఎవరైనా మద్యం విక్రయిస్తే.. రూ.10 వేల జరిమానా విధించేలా ఆంక్షలు విధించుకొని కట్టుబాటు చేశారు. మండలంలో ఈ గ్రామం అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. గ్రామాలకు మద్యంను దుకాణాదారులే సరఫరా చేస్తుంటారని చెబుతున్నారు. మహిమలూరులో మద్యం దుకాణం ఉన్నందున సమీప రామస్వామిపల్లిలో మాత్రం బెల్ట్‌షాపులు లేవని చెబుతున్నారు. మద్యం దుకాణాలను ఆత్మకూరు పట్టణంలో, మండలంలోని మహిమలూరు లో ఏర్పాటు చేయగా అక్కడికెళ్ళి మద్యపాన ప్రియులు మద్యం తెచ్చుకోవడం కొంత తగ్గుతుందని అందరూ భావించగా



గ్రామాలకే మద్యం సరఫరా అవుతుండడంతో మద్యం సేవించే వారి సంఖ్య కూడా పెచ్చుపెరిగిపోతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కొన్నిచోట్ల దేవుడిపాట అంటూ మద్యం విక్రయించేవారు కొంత నగదును చెల్లించి మద్యం విక్రయించేలా ఏర్పాట్లు జరగ్గా మరికొన్ని చోట్ల పంచాయతీ వారికి నగదు చెల్లించే ఏర్పాటు జరిగిందని చెబుతున్నారు. గ్రామాల్లో మద్యం అమ్మకాలు లేనే లేవని ప్రభుత్వం చెబుతుండగా, గ్రామాల్లో ప్రజలు మాత్రం విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారని చెబుతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం ఎలాంటి కట్టడి చర్యలు లేకుండా మౌనంగా చూస్తున్నారని, ఎవరైనా స్క్వాడ్ సిబ్బంది దాడులు నిర్వహించినపుడు మాత్రమే సంబంధిత వ్యక్తులను తీసుకెళుతుంటారని, వారు బెయిల్‌పై వచ్చి మళ్ళీ మద్యం విక్రయాలు సాగిస్తుంటారని -మిగతా 2లో







## మానసిక ఒత్తిడి వల్లే..
# అనారోగ్య సమస్యలు !

**ప్రముఖ న్యూరాలజిస్టు డా. బిందు మీనన్**

**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :**

**అనారోగ్య సమస్యలన్నిటికీ మూలం మానసిక ఒత్తిడి కారణమని అనుభవజ్ఞురాలైన ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ బిందు మీనన్ సూర్య ప్రతినిధితో ముచ్చటించారు.** వివరాలిలా ఉన్నాయి.

**సూర్య : మానసిక ఒత్తిడి ఎందువల్ల వస్తుంది ?**

**డాక్టర్ :** పని భారం, వ్యక్తిగత సమస్యలు, ఆరోగ్య సమస్యలు లేదా ఆకస్మిక మార్పులు వంటి పరిస్థితుల నుండి మన మనస్సు లేదా శరీరం ఒత్తిడిని అనుభవించినప్పుడు ఒత్తిడి ఏర్పడుతుంది. ఇది సవాళ్లకు శరీరం యొక్క సహజ ప్రతిచర్య.

**సూర్య : ఒత్తిడి వస్తే ఏం చేయాలి ?**

**డాక్టర్ :** లోతైన శ్వాసలు తీసుకోండి. లేదా విశ్రాంతి పద్ధతులను ప్రయత్నించండి. నడకకు వెళ్లండి లేదా తేలిక పాటి వ్యాయామం చేయండి. మీ భావాలను స్నేహితుడు లేదా కుటుంబ సభ్యునితో పంచుకోండి. సంగీతం వినండి, చదవండి లేదా మీరు ఆనందించేది ఏదైనా చేయండి.

**సూర్య : మానసిక ఒత్తిడి వల్ల వచ్చే సమస్యలు ఏమిటి ?**

**డాక్టర్ :** దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల ఇవి సంభవించవచ్చు. తలనొప్పి, అధిక రక్త పోటు, ఆమ్లత్వం, నిద్రలేమి, జ్ఞాపక శక్తి సమస్యలు, చిరాకు, ఆందోళన, నిరాశ, గుండె జబ్బులు, మధుమేహం, స్ట్రోక్ ప్రమాదం పెరుగుతుంది.

**సూర్య : స్ట్రెస్‌కు ఓన్లీ టాబ్లెట్లే వాడాలా ! జీవనశైలిలో మార్పు చేసుకోవాలా !**

**డాక్టర్ :** కొన్ని సందర్భాల్లో మాత్రలు సహాయపడవచ్చు, కానీ అవి మాత్రమే పరిష్కారం కాదు. ఆరోగ్యకరమైన అలవాట్లు, మంచి నిద్ర, వ్యాయామం, యోగా, ధ్యానం, సానుకూల ఆలోచనల ద్వారా ఒత్తిడిని బాగా నిర్వహించవచ్చు. అవసరమైనప్పుడు, వైద్యుల మార్గదర్శకత్వంలో మాత్రమే మందులు వాడతారు.

**సూర్య : స్ట్రెస్ నివారణకు ఆహారం ఏమి తీసుకోవాలి ?**

**డాక్టర్ :** తాజా పండ్లు.. కూరగాయలు (అరటిపండ్లు, నారింజ, ఆకుకూరలు), గింజలు (బాదం, వాల్‌నట్‌లు, గుమ్మడి కాయ గింజలు), తృణధాన్యాలు (ఓట్స్, బ్రౌన్ రైస్), పాలు, పెరుగు, మజ్జిగ. చేపలు లేదా అవిసె గింజలు వంటి ఒమేగా-3 అధికంగా ఉండే ఆహారాలు. తగినంత నీరు తాగండి. ఎక్కువ కెఫిన్, ఆల్కహాల్, జంక్ ఫుడ్‌ను నివారించండి.

### బ్లూమూన్ హెూటల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో

# పోలీసుల పాత్ర అభినందనీయం

### జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని బ్లూమూన్ లక్షరీ రూమ్స్ లాడ్జిలో శనివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సందర్భంలో దర్గామిట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో నైట్ రౌండ్స్ తిరుగుతున్న ఉమెన్ పిఎస్ స్టేషన్ ఎస్ఐ భాస్కర రావు డ్యూటీ నిర్వహిస్తున్నప్పుడు బ్లూమూన్ లగ్జరీ లాడ్జ్‌కు చేరుకోగా లాడ్జ వాచ్మెన్ పరిగెత్తుకుంటూ వచ్చి లాడ్జిలో అగ్నిప్రమాదం సంభవించినట్లు తెలియజేసిన నేపథ్యంలో తక్షణమే ఎస్పై జిల్లా రాత్రి రౌండ్స్ అధికారి హెూంగార్డు డిఎస్పి కి, పిసిఆర్ సిఐకి, దర్గా మిట్ట సిఐకి, రూరల్ డిఎస్పికి, ఫైర్ డిపార్ట్మెంట్‌కి, 108 అంబులెన్స్ సేవలకు సమాచారం అమలు చేశారు. సమాచారం అందుకున్న వెంటనే జిల్లా ఎస్పీ, సంబంధిత



అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని స్వయంగా పరిస్థితులను పరిశీలిస్తూ తగిన సూచనలు చేస్తూ పర్యవేక్షించారు. లాడ్జిలో తొమ్మిది రూములు ఆకుపై ఉండి 14 మంది వ్యక్తులు లోపల ఉన్నారని ఫైర్ డిపార్ట్మెంట్ సిబ్బంది సాయంతో లోపల ఉన్న అందరు వ్యక్తులను సురక్షితంగా రక్షించి లాడ్జి నుండి బయటకు తీసుకువచ్చారు. లాడ్జ్ గదిలోని 301 లో సత్యనారాయణ (43), అభిప్సా మిశ్రా, వారి కుమారు డు శ్రీజయ్ ప్రృస్తీ ఉండిపోగా వారికి ధైర్యం



చెప్పి వారిని క్షేమంగా బయటకు తీసుకువచ్చి వైద్య పరీక్షల కోసం వెంటనే కిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా బాధితులు జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులకు ఆనంద భాష్పాలతో కృతజ్ఞతలు తెలిపారు. రిస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొని బాధితులను కాపాడిన వైనం అభినందనీయమని తెలియజేస్తూ నైట్ రౌండ్స్ అధికారులను, రూరల్ డిఎస్పిని, సిబ్బందిని ఎస్పీ అజితా వేజెండ్ల అభినందించి వారికి రివార్డులు ప్రకటించారు.

### ఆత్మకూరు పట్టణంలో రోడ్డు విస్తరణకు

# గ్రహణం వీడేనా !



**ఆత్మకూరు, మేజర్న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని ప్రధానరహదారి కొంతమేరకు విస్తరణ పనులు నిలిచిపోయి 10 సంవత్సరాలు గడిచినా ఇంకా గ్రహణం వీడడం లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అప్పట్లో కొందరు రోడ్డుకిరువైపులా ఉన్న గదుల యజమానులు అభ్యంతరం పెట్టడం, కోర్టులో స్టే పొందడం తదితర కారణాలతో పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటరు నుండి ఆర్టీసీ డిపోవరకు రహదారి విస్తరణ, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ పనులు నిలిచిపోయాయి. అయితే కోర్డు పెండింగ్లు కూడా పరిష్కారం కాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయనందున పనులు పున:ప్రారంభం కావడం లేదని తెలుస్తోంది. 2012లో ఆనం రామనారాయ ణరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రిగా ఉన్నసమయంలో ఆత్మకూరు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేయించారు. అందులో భాగంగా నెల్లూరు-ముంబాయి రహదారిపై నెల్లూరుపాళెం నుండి పట్టణంలోని సోమశిల రోడ్డు వరకు ఆర్ అండ్బి ఆధ్వర్యంలో, అక్కడనుండి పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయభవనం వరకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిధులు వెచ్చించి రోడ్డును విస్తరించి డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అయితే సోమశిల రోడ్డు సెంటర్ నుండి ఆర్టీసీ డిపోవరకు కొందరు దుకాణాదారులు, భవనాల యజమానులు రోడ్డు మధ్య నుండి 35 అడుగులు రోడ్డు విస్తరిస్తే తమ స్థలాలు కోల్పోవాల్సి ఉంటుం దని, భవనాలు కొంతమేరకు తొలగించాల్సి ఉంటుందని అభ్యంతరం తెలిపారు. అప్పట్లో రామ నారాయణ రెడ్డి అధికారులు, భవనాల యజమానులతో చర్చించి 30 అడుగులుగా నిర్ణయించారు. అక్కడేమో సమ్మతి తెలిపిన కొందరు ఈనిర్ణయంపై కోర్టులో స్టేపొందారు. దాంతో అక్కడ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. 2013లో ఈప నులు జరుగ్నగా ఆర్టీసీ డిపోనుండి సోమశిల రోడ్డు సెంటరు వరకు పనులు జరగకుండా నిలిచిపోయాయి. అయితే కోర్టులో పెండింగ్లు తొలిగిపోగా నష్టపరిహారం చెల్లింపు, రోడ్డు పనులుకు 3 కోట్ల రూపాయలు ఉండగా ఆరుకోట్ల రూపాయలు అవసరమని ఆర్అండ్బి అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. అక్కడ నుండి నిధులు మంజూరు కాలేదు. ఈలోగా రోడ్డు గుంటలమయమై జనాలు, వాహనకారులు నానా అవస్థలు పడసాగగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలమేరకు ఆర్అండ్బి అధికారులు తాత్కాలికంగా తారురోడ్డు వేశారు. డివైడర్లు, సెంట్రల్ లైటింగ్కు మున్సిపాలిటీ నిధులు సిద్ధంగా ఉంచినా రోడ్డు విస్తరణ జరగనందున వారు అని ధులతో ఇతరత్రా పనులు చేపట్టారు. ఇక అప్పటినుండి ప్రభుత్వం నుండి నిధులు మంజూరుకాలేదు. రోడ్డు విస్తరణకు పట్టిన గ్రహణం వీడడం లేదు. పట్టణంలో పాతపోలు సెంటరునుండి సోమశిల రోడ్డువరకు, ఆర్టీసీ డిపోనుండి నెల్లూరుపాళెఉం వరకు రోడ్డు విస్తరించి డివైడర్లు నిర్మించి సెంట్రల్ లైటింగి వేయగా ఆకర్షణీయంగా ఉండగా.. మధ్యలో మాత్రం రోడ్డు సింగిల్, సెంట్రలైటింగ్, డివైడర్లు లేకుండా ఉండగా ఈరోడ్డు జనాలకు, వాహనకారులకు అసౌకర్యంగా ఉంటోంది. మరి ఈరోడ్డుకు పట్టిన గ్రహణం వీడాలంటే ఆనం రామనారాయణరెడ్డి దృష్టి సారిస్తే ఆఘమేఘాలమీద కాగలదని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు.

### గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్ట్‌షాపుల జోరు

(మొదటి పేజీ తరువాయి)

కొందరు చెబుతుతున్నారు. ఏదేమైనా ఆత్మకూరు మండలంలోని గ్రామాల్లో మాత్రం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను సాగిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలనుండి తెలుస్తోంది. ఈ పరిస్థితి మహిళలకు కూడా ఇబ్బందికరంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరి అధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

### ఇళ్ల నిర్మాణం అడ్డుకుంటే ప్రతిఘటిస్తాం



(మొదటి పేజీ తరువాయి)

ఆయన హెచ్చరించారు. అధికారులు నియమ నిబంధనలు పాటించకుండా పట్టాలు రద్దు చేసేందుకు నోటీసులు ఇస్తే, న్యాయస్థానాన్ని ఆశ్రయించి పేదల పక్షాన పోరాడతామని స్పష్టం చేశారు. ప్రజల ఆదరణను పరిశీలిస్తే ఎప్పుడు ఎన్నికలు జరిగినా.. జగన్ ప్రభంజనం ముందు కూటమి పార్టీలు నిలవలేవని ఆయన అన్నారు. ప్రజలు జగన్‌మోహన్ రెడ్డి అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటూ మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా చూడాలని సంకల్పించారని పేర్కొన్నారు. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఆయన కుమారుడు ప్రజల అభివృద్ధి గురించి ఎలాంటి శ్రద్ధ చూపలేదని కాకాణి విమర్శించారు. సర్వేపల్లిలో గ్రావెల్, ఇసుక, బూడిద మాఫియాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని, లంచాల ఆధారంగా బెల్టు షాపులకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. నకిలీ మద్యం విక్రయాలు పెరిగి పేద ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన అన్నారు. రైతులకు యూరియా అందక, పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఇరిగేషన్ పనుల పేరుతో సోమిరెడ్డి తండ్రి, కొడుకులు కోట్లాది రూపాయలు కొల్లగొట్టారని, విచారణ జరిగితే సంబంధిత అధికారులు కూడా జైలు శిక్షలు తప్పవని హెచ్చరించారు. అవినీతి అధికారులను చట్టప్రకారం శిక్షించేందుకు వెనుకాడబోమని ఆయన స్పష్టం చేశారు. సర్వేపల్లిలో పేదల హక్కులపై ఎవరైనా కబ్జా ప్రయత్నం చేస్తే ప్రతిఘటన తప్పదని హెచ్చరిస్తూ, పేదల పక్షాన ఎప్పుడూ నిలబడతామని కాకాణి తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకట శేషయ్య, నాయకులు పారిచర్ల మస్తానయ్య, తాళ్లపాక ఏడుకొండలు కుమారుల వివాహ వేడుకలకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు.

### బాణా సంచా అమ్మకాలకు అనుమతి ఉండాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని ఆత్మకూరు టౌన్, ఆత్మకూరు రూరల్, మర్రిపాడు మండలం, అనంతసాగరం మండలంలోని బాణాసంచా వ్యాపారస్తులు బాణాసంచా విక్రయాలు, నిల్వలు, తయారీకి సంబంధించి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆత్మకూరు సిఐ గంగాధర్ పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల ప్రకారం ఆత్మకూరు సర్కిల్లోని వ్యాపారస్తులు పోలీస్, రెవిన్యూ, అగ్నిమాపక శాఖల అనుమతులు పొందిన తర్వాతే బాణాసంచా విక్రయాలు కొనసాగించాలాన్నారు. అనుమతులు పొందిన షాపులు జనసంచారం తక్కువగా ఉండే విశాలమైన ప్రదేశాలలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్నిమాపక ప్రమాదాలు నివారించేం దుకు ప్రతి దుకాణం వద్ద నీటి డ్రమ్ములు, పొడి ఇసుక, అగ్నిమాపక పరికరాలు ఉంచుకోవాల్లన్నారు. అనుమతులు లేకుండా బాణాసంచ విక్రయించినా.. నిల్వ చేసినా.. తయారు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఆయన హెచ్చరించారు. ఆత్మకూరు సర్కిల్ పరిధిలో ఎక్కడైనా బాణాసంచా విక్రయాలు అక్రమంగా తయారు చేసినా.. నిల్వచేసిన వారిని గుర్తిస్తే వెంటనే స్థానిక పోలీసులకు కానీ, డయల్ 112కు కానీ సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటా మని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ పేర్కొన్నారు.

# కూటమి పథకాలతో సంతోషంగా ఉన్న ప్రజలు : తుమ్మల



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధిస్తున్న అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమకార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలు అత్యంత సంతోషకరంగా ఉన్నారన్నారు. తాజాగా ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు 15వేల రూపాయల వంతున వారి ఖాతాల్లో జమచేయగా ఆత్మకూరు నియోజకవర్గంలో 1600మందికి ఈ నగదు జమ అయిందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమం సాధించడంతోపాటు పేదరిక నిర్మూలనకు పి4 పథకం అమలుచేస్తున్నారని, తద్వారా దాతలు స్వచ్ఛందంగా వచ్చి పేద కుటుంబాలను దత్తత తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. దాతలను మార్గదర్శకులుగా ఎంపికచేసి వారు దత్తత తీసుకునే కుటుంబాలను బంగారుకుటుంబాలుగా నామకరణం గావించి పేదరికనిర్మూలన లక్ష్యసాధనకు ప్రత్యేక దృష్టి సారించి కృషిచేస్తున్నారన్నారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్‌ప్రయాణ సౌకర్యం కూడా కల్పించారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమినేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్‌హిట్‌గా అమలుచేశారన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దీర్ఘకాలికవ్యాధి గ్రస్థులకు పెన్షన్ పెంచి ఇళ్ళవద్దనే అందించేలా అమలుచేస్తున్నారని, మహిళలకు ఉచిత గ్యాస్‌సిలిండర్లను అందించారని, మెగా డిఎస్‌సి అమలుచేశారని, చదువుకునే బిడ్డల తల్లుల ఖాతాల్లో తల్లికివందనం నగదు జమచేశారని, రైతులకు అన్నదాతసుఖీభవ నిధులు విడుదలచేశారని, అన్నాక్యాంటిన్‌లు ప్రారంభించారని, తాజాగా మహిళలకు ఉచితంగా రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీబస్సుల్లో ప్రయాణించే సదుపాయం కల్పించారని ఆయన పేర్కొన్నారు. ఇచ్చిన మాటలను నిలుపుకునే నైజం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదని, గత పాలకుల తప్పిదాలవలన రాష్ట్రం ఆర్థికసంక్షోభంలో ఉన్నా ఆపరిస్థితిని గాడిలోపెడుతూ అటు అభివృద్ధి సాధిస్తూనే ఇచ్చిన సంక్షేమపథకాలను అమలుచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రధానంగా మహిళలకు గ్యాస్‌సిలిండర్లు, తల్లికివందనం, ఉచితబస్ ప్రయాణం కల్పించారని ,వారంతా ఎంతో ఆనందంగా ఉన్నారని, అత్యంత సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, వారిలో సంతోషం వెల్లివిరుస్తుందని చంద్రారెడ్డి వివరించారు. రాష్ట్రానికి అధికంగా పరిశ్రమలు రప్పించి లక్షలాదిమంది నిరుద్యోగయువతకు ఉద్యోగావకాశాలు కల్పించే ప్రయత్నాన్ని ముమ్మరంగా సాగిస్తున్నారన్నారు. అటు అభివృద్ధిపరంగా అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు, రోడ్లు తదితర అభివృద్ధి సాధిస్తూనే ఇచ్చిన హామీలను అమలుచేస్తున్న ఘనత తమ కూటమి ప్రభుత్వానిదేనని ఆయన వెల్లడించారు. పల్లెవెలుగు, అల్ట్రాపల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో గుర్తింపుకార్డులు చూపి మహిళలు ఉచితంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రయాణం చేసే అవకాశం తమ ప్రభుత్వం కల్పించిదన్నారు. తమ ప్రభుత్వం ఇచ్చినమాటకు కట్టుబడేదని, సూపర్‌సిక్స్ పథకాలను సూపర్‌గా అమలుచేస్తుందని, ఈపథకాలతో అన్నివర్గాలకు కూడా ఆర్థికవెసులుబాటు లభిస్తుందని చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా సాధిస్తున్నారని, ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలకు, పాఠశాల భవనాలకు, దేవాలయాల అభివృద్ధికి వందలాదికోట్ల రూపాయల నిధులు సాధించారని చంద్రారెడ్డి పేర్కొన్నారు.

### రేషన్ బియ్యాన్ని మెక్కే పందికొక్కులు..

# ఒకటి కాదు చాలానే ఉన్నాయి : జనసేన నేత కిషోర్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని మెక్కే పందికొక్కులు ఒకటి కాదు చాలానే ఉన్నాయి. నిన్న ఎన్‌యుడీఏ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు చెప్పినట్టు ఒకటిమూడు జిల్లాలని కంట్రోల్ చేస్తుంటే మరొక ఇద్దరు 8 జిల్లాల కంట్రోల్ చేస్తున్నారు. పేదవాడి కడుపు కొట్టి ఏకంగా షిప్పుల్ని కొని వ్యాపారం చేసే అంత స్థాయికి ఎదిగారు. నెల్లూరు సిటీ జనసేన చేరికలలో జనసేన కిషోర్ గునుకుల మాట్లాడుతూ.. పేద ప్రజలను ఆప్తులుగా భావించి డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ వారి జీవన ప్రమాణ స్థాయిని పెంచేందుకు జనసేన పార్టీ స్థాపించారు. వారి అడుగుజాడల్లో నడుస్తున్న పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారంలోకి రాగానే కోట్ల రూపాయల విలువచేసే పేదల బియ్యాన్ని పట్టుకున్నారు. ఈ రేషన్ బియ్యం అక్రమ రవాణా ఏదైతే ఉందో ఒక వ్యవస్థ. కొంతమంది వ్యక్తులు లక్షల మందికి వెళ్లాల్సిన రేషన్ బియ్యాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. కోట్లలో మునిగి తేలాడుతున్నారు. అధికారంలో ఏ పార్టీ ఉంటే ఆ పార్టీకి చేరిపోయి వాళ్ళ అక్రమ వ్యాపారం సాఫీగా సాగించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అవినీతి పరులను ఏరువేస్తున్నప్పటికీ ఇంకా కొంతమంది అధికారులు వ్యవస్థ ఈ మాఫియా చేస్తూనే ఉంది. వీటన్నిటిని పట్టించడానికి కూటమి నాయకులు సహకారం అవసరం ఉంది. పేదల కడుపు కొట్టి షిప్పింగ్ కంపెనీలో పార్టనర్‌గా ఎదిగిన ప్రముఖులు ప్రముఖులందరూ సిగ్గుపడాలి. అంచెలంచెలుగా అవినీతిని నిర్మూలించేందుకు కూటమి పెద్దలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పౌరసరఫరాల శాఖ నాదెండ్ల మనోహర్, అదే విధంగా మన మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర, రూరల్ ఎమ్మెల్యే శ్రీధరన్న అందరూ కూడా ఈ క్రిమినల్ సామ్రాజ్యాన్ని కూల్చేందుకు సహకరించాలని పిలుపునిస్తున్నాము. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, సిటీ పర్యవేక్షకులు గునుకుల కిషోర్, నెల్లూరు ఏఎంసీ డైరెక్టర్ విజయలక్ష్మి, నెల్లూరు జిల్లా దిశా కమిటీ సభ్యురాలు మీదురు శాంతికల, 16 డివిజన్ నాయకులు విశ్వనాథ్, సీనియర్ నాయకులు బెల్లపు సుధా మాధవ్, గుర్రం కిషోర్, వెంకటేశ్వర్లు, రమేష్, వీర మహిళలు రేఖ, కామేశ్వరి, సిటీ కమిటీ సభ్యులు బాలు, వర్షన్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మాలేపాటిని పరామర్శించిన నేతలు



**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ఆగ్రో చైర్మన్ మాలేపాటి సుబ్బరాయుడు ఇటీవల అనారోగ్యంతో అస్వస్థకు గురయ్యారు. అనంతరం తాడేపల్లిలోనే మణిపాల్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర వారిని వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యంగా ఉండాలని కూడా తెలిపారు. అలాగే ఆదివారం రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్రావు అలాగే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు ఇతర ఎమ్మెల్యేలు వారి పరామర్శించి ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు.

## బస్సు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ బస్టాండు వద్ద ఆదివారం ఒక ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో గడ్డం నాగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. తెల్లవారుఝామున ఆత్మకూరు డిపోకుచెందిన ఆర్టీసీబస్సు ఏఎస్‌పేటకు వెళ్ళేందుకు మలుపు తిప్పే సమయంలో ప్రమాదవశాత్తు నాగరాజు ఆ బస్సు క్రింద పడ్డాడు. దాంతో ఆయన ఎడమకాలు నుజ్జునుజ్జు అయింది. తలకు కూడా గాయాలయ్యాయి. చికిత్సకోసం నాగరాజును ఆత్మకూరులోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించాలని వైద్యాధికారులు సూచించారు. స్థానిక ఎస్‌ఐ షేక్ జిలాని ప్రమాద వివరాలు తెలుసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## రోడ్డుప్రమాద మృతులకు ఆర్థికసాయమందించాలి : సీపీఎం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు– ముంబాయి జాతీయరహదారిపై ఆత్మకూరు సమీపంలోని పెరమనరోడ్డు వద్ద ఇటీవల జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో మీతిచెందిన వారి కుటుంబాలకు ఆర్థికసాయమందించాలని ఆత్మకూరు పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కారును టర్బో భారీ వాహనం ఢీకొనగా కారులో ప్రయాణిస్తున్న 7మంది మృతిచెందిన విషయం తెల్సిందే. ఈరోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయాన్ని వెంటనే ఇవ్వాలని ఆయన కోరారు. ఈమేరకు సోమవారం ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావనికి ఒక వినతిపత్రం కూడా అందజేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రమాదం జరిగి నెలకావస్తున్నా ప్రభుత్వం ఇంకా ఆర్థికసాయమందించకపోవడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. దాంతోపాటు ఈ ప్రమాదానికి కారణమైన మిగతావారిని కూడా అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే తాము ప్రజాందోళనకు దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

## ఉత్తర క్రియలకు హాజరైన నేదురమల్లి



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండలంలోని చాగణం రాజుపాలెం గ్రామానికి చెందిన ఆత్మీయుడు ముప్పాళ్ళ వెంకటేశ్వరరాజు తల్లి ముప్పాళ్ళ పార్వతమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించటం పట్ల వైసీపీ నేత వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి సైదాపురం మండల అధ్యక్షులు మన్నారపు రవికుమార్ యాదవ్ విచారం వ్యక్తం చేశారు ఆదివారం సైదాపురం మండలంలోని చాగణం రాజుపాలెం ముప్పాళ్ళ వెంకటేశ్వరరాజు నివాసంలో జరిగిన ముప్పాల పార్వతమ్మ ఉత్తర క్రియలకు వైఎస్ఆర్సిపి వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముప్పాల పార్వతమ్మ చిత్రపటానికి పూల బాణాలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సైదాపురం మండల అధ్యక్షులు మన్నారపు రవికుమార్ యాదవ్, కొండాపు మోహన్ రావు, అబిరాజు, మాలకొండ రెడ్డి, దయాకర్ రెడ్డి, శ్రీనివాసరాజు, శివ నాయుడు, సైదాపురం ఉపసర్పంచ్ బులిగర్ల శివకుమార్ యాదవ్యాదవ్ ఇదితరులు పాల్గొన్నారు.

# కార్తీక దీపోత్సవం గోడ పత్రికల ఆవిష్కరణ

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** గణేష్ ఘాట్‌లో నవంబరు 5, 6, 7 తేదీలలో జరిగే మహా కార్తీక దీపోత్సవం గోడ పత్రికలను కార్తిక దీపోత్సవ సమితి నెల్లూరు సింహపురి వారు ఆవిష్కరించారు. స్థానిక రామ్మూర్తి నగర్ ఎన్నార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సింహపురి కార్తీక దీపోత్సవ సమితి విస్తృత స్థాయి సమావేశంలో నవంబర్ 567 తేదీలలో స్థానిక ఇరుకళల పరమేశ్వరి శ్రీ స్వర్ణ లింగేశ్వర స్వామి వారి దేవస్థానాల స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్ వద్ద జరిగే మహా కార్తీక దీపోత్సవం కార్యాచరణ గోడ పత్రికల ఆవిష్కరణ జరిగింది. అధ్యక్షులు డాక్టర్ కే వెన్నెల మాట్లాడుతూ నెల్లూరు నగరంలో జరిగే మహా కార్తీకదీపోత్సవం కార్యక్రమం తెలుగు రాష్ట్రాలలో ఆధ్యాత్మిక కేంద్రంగా ఏర్పడిందన్నారు. సుమారు లక్ష మంది మహిళలచే దీపోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేస్తున్నారని, ఈ సంవత్సరం నవంబర్ 5, 6, 7 తేదీలలో ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఆమె తెలిపారు. ప్రతి కార్యకర్త నగరంలోని హిందువులై ఇంటింటికి వెళ్లి కార్తీక దీపోత్సవానికి ఆహ్వానిసున్నారన్నారు. కార్యదర్శి బయ్య మల్లిక మాట్లాడుతూ.. ఈ సంవత్సరం ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ప్రతి ఒక్కరూ శ్రీశైలం మల్లికార్జున స్వామి వారి విగ్రహానికి అభిషేకాలు అర్చనలు స్వయంగా చేసుకునే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దంపతులతో శ్రీ పార్వతీ పరమేశ్వరుల శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామి వారి కళ్యాణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. చైతన్యతపోవన్ శివ కేశవ్ పీఠం అధ్యక్షులు మాత శివానంద సరస్వతి సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ నవంబర్ 6 తేదీ గురువారం ప్రత్యేకించి శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలను స్వామూహికంగా సాంప్రదాయబద్ధంగా ప్రవచనాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 7తేదీ శుక్రవారం స్వర్ణ లింగేశ్వర స్వామి వారి వార్షిక కుంభాభిషేక కార్యక్రమాలను ఘనంగా తుని తపోవనం



పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. సింహపురి హిందూ బంధువులందరూ ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఉపాధ్యక్షులు కోడూరు జయప్రద మాట్లాడుతూ సింహపురి కార్తిక దీపోత్సవం కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ దీపోత్సవ సామాగ్రిని అందరికీ ఉచితంగా అందజేస్తున్నామని పేర్కొంటూ హిందూ సామాజిక సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో మహిళలందరూ పాల్గొంటారని నెల్లూరు నగరంలో వెయ్యి సంవత్సరాల కిందట కాకతీయ రాజులు నిర్మించిన స్వర్ణాల చెరువులో ఆరువాయితీగా వస్తున్న ఈ కార్యక్రమాన్ని జయప్రదమ్ చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక అధ్యక్షులు కోడూరు జయరాం, సంఘటన కార్యదర్శి ముక్కాల వ్యాస ప్రసాదు, శ్రీకంఠం రమణయ్య, బాల సుబ్బారావు, రమేష్ ఏవిఆర్ మోహన్ రావులతొ కలిసి గోడపత్రికలను కరపత్రాలు ఆవిష్కరించారు. పి.సురేందర్‌రెడ్డి, కిషోర్, హర్షవర్ధన్,శ్రీనివాసులు, రంగరాజన్, భాస్కర్ రావు, సుధాకర్ రావు, వెంకటేశ్వర్లు, పలు మహిళ మండళ్ల కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం : ఆనం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కూడా తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్నటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నేడు (సోమవారం) మధ్యాహ్నం 3:00 గంటలకు నెల్లూరు రూరల్ నియోజకవర్గం 22వ డివిజన్ బివి నగర్ ఆర్టీవో ఆఫీస్ దగ్గర ఉన్న ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం మరియు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కి వినతిపత్రం ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## గంధ మహొత్సవానికి ఎమ్మెల్సీకి ఆహ్వానం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సిటీ ఆఫీసులో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని 52వ డివిజన్ వైసీపీ ఇన్‌చార్జ్ మహబూబ్ బాషా డివిజన్ కోఆర్డినేటర్ కందుకూరి రమేష్‌తో కలిసి మోహద్దీన్ షావలి దర్గా పీఠాధిపతి షబ్బీర్ ముర్షిద్ విచ్చేసి ఈనెల 20వ తేదీ జరగనున్న మోహద్దీన్ షావలి దర్గా గంధ మహొత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఆదివారం పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ముస్లీం నాయకులు మాట్లాడుతూ.. గంధ మహొత్సవానికి తప్పకుండా రావాలని కోరారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : ఎంఈఓ




**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, నెల్లూరు డిస్టిక్ ఎడ్యుకేషనల్ అధికారి ఆదేశాల మేరకు ఆదివారం కూడా ప్రైవేట్ విద్యాసంస్థలు నిర్వహించడంపై కావలి ఎంఈఓ గోవిందయ్య కన్నెర్ర చేశారు. కావలి భాష్యం స్కూలు నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్న యాజమాన్యంపై ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే కావలి పట్టణంలో ఎన్నైతే ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయో నిబంధనలకు వ్యతిరేకంగా క్లాసులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రతి ఒక్కరిని హెచ్చరించడం జరిగింది. విద్యాసంస్థలు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు.

# యుటీఎఫ్ ఆధ్వర్యంలో మండల మహాసభ సమావేశం

**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాల ఆడిటోరియం నందు ఆదివారం యుటీఎఫ్ కావలి రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల మహాసభను ఘనంగా నిర్వహించారు. ముందుగా యుటీఎఫ్ సీనియర్ కార్యకర్త పాశం శ్రీనివాసులు ముఖ్య అతిథులను వేదిక మీదకు ఆహ్వానించారు. అమరులకుసంతాపం చేయాలని యుటీఎఫ్ సీనియర్ కార్యకర్త రామకృష్ణ తీర్మానించారు. సభకు యుటీఎఫ్ అధ్యక్షులు ఎస్‌కే ముజీబ్ అహ్మద్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినా వారి విధానాలల్లో మార్పులేదన్నారు. యుటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కిలారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. యుటీఎఫ్ నిర్మాణం, లక్ష్యాలు, సిద్ధాంతాలు, క్రమశిక్షణ, పూర్వికుల త్యాగాలు, సమస్యల పట్ల పోరాట పటిమలతో, బలమైన పునాదులతో పార్టీ ఏదైనా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ముందు చూపుతో వెళ్తోంది అని అన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఈ ప్రభుత్వం పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి నిరసనగా కనువిప్పు కల్గించేందుకు వేలాది మందితో ఇటీవల రణభేరి, ధర్నా కార్యక్రమాలు యుటీఎఫ్ నిర్వహించిందని గుర్తు చేశారు. యుటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యురాలు బి. శ్రీదేవి మాట్లాడుతూ.. యాప్‌ల భారం, టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణత ఉండాలనడంతో ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురౌతున్నారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాలు తెచ్చే మార్పుల వలన ఎవరికీ ప్రయోజనం లేకుండా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసేవిధంగా ఉన్నాయని శ్లాఘించారు. యుటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి జి.వేణుగోపాల్ మాట్లాడుతూ.. యుటీఎఫ్ ఆధ్వర్యంలో కావలి రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో సంవత్సర కాలంగా చేపట్టిన అంశాలపై సుదీర్ఘంగా కార్యదర్శి నివేదికను వివరించారు. ఆర్థిక కార్యదర్శి పి.చెన్నక్రిష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నా పాతసమస్యలు పరిష్కారం కాకుండానే క్రొత్త సమస్యలను సృష్టిస్తున్నారని సమస్యల పరిష్కారం కోసం సంఘటితం కావాలన్నారు.ఆర్థిక నివేదిక ప్రవేశపెట్టారు. యుటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వీవీ శేషులు మాట్లాడుతూ.. యుటీఎఫ్ 12వ పీఆర్‌సీ, డీఏ బకాయిలు, ఐఆర్ తదితర సమస్యల పరిష్కారం కోసం కనీవినీ ఎరుగని రీతిలో ఉద్యమాలు చేపట్టిందని, నవంబరు మొదటి వారం నుండి యుటీఎఫ్‌చే ఉద్యమం ఉధృతం చేయనున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయనేతలపై పెట్టిన కేసులన్నింటినీ భేషరతుగా ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. యుటీఎఫ్ సీనియర్ నేత శ్రీహరి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన పేద, ధనిక తారతమ్యాలు రోజు రోజుకూ పెరుగుతున్నాయని తనదైన శైలిలో విపులీకరించారు. కార్పోరేట్లకు ప్రభుత్వ ఆస్తులు అప్పనంగా అమ్మేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ప్రజల మంచి గురించి ఆలోచించే ప్రభుత్వాలు లేవన్నారు. ఆధునిక భారతదేశానికి అవుట్ డేటెడ్ చదువులు సిలబస్‌లో పెట్టే పనిలో కేంద్రం ఉండటం సరికాదని, సాంకేతికత, శాస్త్రీయ ధృక్పధంతో కూడిన సిలబస్ ను కరికులంలో చేర్చాలని ఉద్ఘాటించారు. ఎన్ఈపీ2020తో



ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తోందని, టెట్ కు వ్యతిరేకంగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలు న్యాయవ్యవస్థ ద్వారా పోరాడుతున్నాయన్నారు. జిల్లా ఎఫ్‌డబ్ల్యూఎఫ్ సభ్యులు సీఆర్‌ఎం లక్ష్మి మాట్లాడుతూ.. మహనీయులు రామిరెడ్డి లాంటి పాతతరం నాయకుల కృషివల్ల నేడు బతకలేని బడి పంతులు నుండి బతక నేర్చిన బడిపంతులుగా మారారని, ఆ విషయాలను ప్రస్తుతం అందరం గుర్తుంచుకోవాలని విస్మరించరాదని వారిని స్ఫూర్తిగా తీసుకొని ఉద్యమాలలో భాగస్వామ్యులు కావాలన్నారు. సీనియర్ కార్యకర్త రమణయ్య దళంనేతృత్వంలో పాడిన పలు గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి. త్వరలో రిటైర్డ్ కాబోతున్న పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మహిళా బ్యాగ్ లను డొనేట్ చేసిన సీఆర్‌ఎం లక్ష్మి, భోజనాలకు రూ.5000 వితరణ చేసిన పి.చెన్నక్రిష్ణయ్యను, ఉచితంగా ఆడిటోరియం అందించిన శ్రీసాయి డిగ్రీ కళాశాల యాజమాన్యంను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బి.మాధవరావు, యుటీఎఫ్ సీనియర్ నేతలు పి.మాధవ, సత్యనారాయణ, తోట వెంకటేశ్వర్లు, ఐ.వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడారు. 100కు పైగా ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఇందులో భాగంగా ఆద్యంతం పాల్గొన్నారు. నూతన మండల కమిటీకి అభినందనలు తెలిపారు.

# ఆయుర్వేదం వైపు ప్రజల అడుగులు

- రోగుల మన్ననలు పొందుతున్న విరువూరు వైద్యశాల
- దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు
- ఆయుష్మాన్ భారత్‌లో ఎంపికైతే సేవలు పెరిగే అవకాశం
- వైద్యశాలకు సదుపాయాలు కల్పించాలంటున్న ప్రజలు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** శాస్త్ర సాంకేతికత అభివృద్ధి చెందిన నేటి ఆధునిక యుగంలో ప్రజలు అల్లోపతి వైద్యం నుంచి క్రమంగా ఆయుర్వేదం వైపు మరలుతున్నారు. అల్లోపతి వైద్యం పొందుతున్న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల్లో దుష్ప్రభావాలు ఎక్కువగా కనిపిస్తుండడంతో ఎలాంటి దుష్ప్రభావం చూపని ఆయుర్వేదం వైద్యం పట్ల ఆకర్షితులవుతున్నారు. నేటి పోటీ ప్రపంచంలో ఆరోగ్యం పట్ల పెరుగుతున్న ఆసక్తి మరియు సహజ విధానాల పట్ల మొగ్గు చూపిస్తున్న కారణంగా ఆయుర్వేదం ప్రాముఖ్యతను సంతరించుకుంటోంది. ప్రస్తుత పరిస్థితుల్లో దీర్ఘకాలిక వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేదం ఒక ముఖ్యమైన పరిష్కారంగా మారుతోంది. ఆయుర్వేదం అనేది ఒక పురాతన భారతీయ వైద్య విధానం, ఇది ఆరోగ్యంపై సమగ్ర దృక్పథాన్ని అందిస్తుంది. కాబట్టి ప్రజలు ఆహారపు అలవాట్ల నుంచి ఆరోగ్యం వరకు పాత పద్ధతుల వైపు మరలుతున్నారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం విరువూరులోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సంజీవనిగా కనిపిస్తోంది. ఇక్కడ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను 1955 జూన్ 17వ తేదిన అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి బెజవాడ గోపాల్‌రెడ్డి ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నప్పటికీ ఇక్కడ ఆయుర్వేద వైద్యశాలలో ఎంతో మంది సేవలు పొందారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్యశాల పనిచేస్తుంది. అల్లోపతి వైద్యానికి పోటీగా ఈ ఆయుర్వేద వైద్యశాల ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. ఇక్కడి వైద్యశాలకు పొదలకూరు తోపాటు రాపూరు, వెంకటగిరి, సంగం, ఆత్మకూరు, బుచ్చిరెడ్డిపాలెం మండలాల నుంచి రోగులు ఎక్కువగా వస్తూ ఉంటారు. ప్రస్తుతం ప్రతిరోజు సుమారు 35 నుంచి 50 మంది వరకు రోగులు ఇక్కడ వైద్యశాలలో సేవలు పొందుతున్నారు. ఈ వైద్యశాలలో అన్ని రకాల సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక కీళ్ల నొప్పులు, గ్యాస్ సమస్య, మలబద్ధకం లాంటి రోగాలకు మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. కిడ్నీలో రాళ్లు, డిస్క్ సమస్య, సైనసిస్, మొలలు, ఫిస్టులా వంటి వాటిని ఆపరేషన్ లేకుండా మందులతో నయం చేస్తున్నారు. మధుమేహం, బీపీ, సోరియాసిస్ లాంటి వ్యాధుల తోపాటు స్త్రీల రోగాలకు ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్లు ఇక్కడి వైద్యులు డాక్టర్ పి.వినోద్ బాబు తెలిపారు. పీరియడ్స్ రాకుండా బాధపడే మహిళలకు టానిక్, మాత్రల ద్వారా సమస్యను నివారిస్తున్నట్లు ఈ సందర్భంగా డాక్టర్ పేర్కొన్నారు. కోవిడ్ తర్వాత ఆయుర్వేదంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ప్రజల్లో నమ్మకం ఎక్కువగా కలిగిందన్నారు. ఇంతలా ఆదరణ పొందుతున్న ఈ వైద్యశాలకు ప్రభుత్వం మరిన్ని వసతి సౌకర్యాలు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.





## ఆయుర్వేద సేవలను సద్వినియోగం చేసుకోండి

● డాక్టర్ పి.వినోద్ బాబు



విరువూరులోని ఆయు ర్వేద వైద్యశాల అందిస్తున్న సేవలను పొదల కూరు పరిసర ప్రాంతాల ప్రజలు సద్విని యోగం చేసుకోవాలి. ఇది ప్రభుత్వ ఆధ్వ ర్యంలో నడుస్తున్న వైద్యశాల. మందులు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. సాధారణ వ్యాధులతోపాటు దీర్ఘకాలిక వ్యాధులకు కూడా మందులు అందుబాటులో ఉన్నాయి. ఈ వైద్యశాల ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రాంలో ఎంపిక అయితే మరిన్ని సేవలు అందుతాయి.

# ఆధ్యాత్మిక సేవ ద్వారా ఆత్మోన్నతి : ఖమ్మం మాస్టర్ శ్రీనివాసరావు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఆధ్యాత్మిక సేవ చేయడం ద్వారా ఆత్మ ఉన్నతి వేగవంతంగా జరుగుతుందని, అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం సీనియర్ పిరమిడ్ మాస్టర్ చల్లా శ్రీనివాసరావు అన్నారు. వింజమూరులోని శ్రీ వేద వ్యాసా వశిష్ట పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రం నందు ఆదివారంబి ఆత్మజ్ఞానం కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని ధ్యాన సాధన అనంతరం అద్భుతమైన ఆత్మజ్ఞానం అందించారు. ఆధ్యాత్మిక సేవ ద్వారా, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకారం అందించడం ద్వారా తాను పొందిన లాభాల గురించి, తాను ఆధ్యాత్మికంగా ఎదిగిన విధానం గురించి చక్కగా వివరించారు. ఆధ్యాత్మిక సేవ చేసేవారు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు దానం చేసేవారు. పై లోకంలో అనగా యూనివర్సల్ బ్యాంకులో భద్రంగా ఆస్తులు దాచి పెట్టుకోవడం అని తెలుసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రచారం కూడా చేసి అందరికీ మనం అందుకున్న జ్ఞానాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, సుబ్బలక్ష్మి, హేమలత వారి వారి సందేశాలను చక్కగా వివరించారు. శాకాహారం యొక్క ప్రాముఖ్యతను గూర్చి తెలియజేస్తూ, కరపత్రాలు పంచుతూ, నినాదాలు ఇస్తూ పిరమిడ్ నగర్, పోలేరమ్మ గుడి వీధి వైశ్య బజార్, కుమ్మరి బజార్ల మీదుగా మహాకరుణ బిశాకాహార ర్యాలీ నిర్వహించారు. మాస్టర్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ధ్యానులందరికీ చక్కటి ధ్యాన ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరావు, సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఆచారి, గురవయ్య, రాజేశ్వరి, ఉమా, లక్ష్మి, వెంకటేశ్వర్లు ఇంకా 70 మంది ధ్యానులు పాల్గొన్నారు.



# పలువురు టీడీపీ కార్యకర్తలు వైసీపీలో చేరిక



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నగరంలోని 52వ డివిజన్ నాయకులు మహబూబ్ బాషా, రమేష్ ఆధ్వర్యంలో టీడీపీని వీడి పలువురు కార్యకర్తలు ఆదివారం ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి వచ్చిన వారికి కండువా వేసి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే ఈ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని చెప్పారు. పార్టీలో చేరిన వారికి. ప్రాధాన్యతనిస్తూ సమూచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నర పాలనలోనే.కూటమి ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూట కట్టుకుందని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం. రెండు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని తెలిపారు. మళ్లీ ఈ రాష్ట్రానికి జగన్మోహన్‌రెడ్డి నాయకత్వం కావాలని ప్రజలు బలంగా ఆకాంక్షిస్తున్నారని జగన్మోహన్‌రెడ్డి మళ్ళి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం తధ్యమన్నారు.

# అమ్మవారికి బంగారు కానుక



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలో వెలసియున్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు గల పరమేశ్వరి అమ్మవారికి భక్తులు మునగల మహేష్ రెడ్డి, కీర్తిరెడ్డి ఆదివారం ఉదయం బంగారు ఆభరణంను సమర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాదికారి వి.గిరికృష్ణ, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, కమిటీ సబ్యుల సమక్షంలో అందజేయడం జరిగింది అని తెలిపినారు.

# ఆదిత్య హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఆదిత్య హాస్పిటల్, యామిని న్యూరో కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ముత్తుకూరులో ఉచిత వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ యామిని రోగులకు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. 120 మందికి ఉచితంగా వైద్యం అందించినట్లు ఆదిత్య హాస్పిటల్ మేనేజ్మెంట్ భగవాన్ తెలియజేశారు. ఈ విభాగంలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యం చేసినట్లు పేర్కొన్నారు. ఉచిత వైద్య శిబిరం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్సీ పర్వత రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మైపాడు గేట్ సెంటర్లో వైసీపీ నాయకులు వంగళ్ల చిన్న శ్రీనివాసులు రెడ్డి కుమార్తె వివాహ వేడుకకు ఆదివారం సిటీ నాయకులతో కలిసి వైఎస్ఆర్సీపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా హాజరైన స్థానిక వైసీపీ నేతలతో చంద్రశేఖర్ రెడ్డి పలువురుతో మాట్లాడారు.

# మహిమలూరులో నిరుపయోగ, నిర్లక్ష్యభవనం

▸ నిధులు వృధా ▸ స్థల దాతల వ్యధ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం మహిమలూరులో 18సంవత్సరాలుగా ఓ అర్ధాంతర నిర్మాణ భవనం అధికారుల, ప్రభుత్వ నిర్ధక్ష్యానికి నిదర్శనంగా దర్శన మిస్తోంది. శ్లాబ్ వరకు నిర్మాణం జరిగిన ఈ భవనం వృధాగా ఉండగా భవన నిర్మాణానికి స్థలం విరాళంగా సమకూర్చిన దాతలు వ్యధ చెందుతున్నారు. ఆత్మకూరు ప్రాం తంలో అనేక భవనాలు చూస్తుంటే ప్రభుత్వ నిధులకు జవాబుదారీతనం లేదనేందుకు సాక్ష్యాలుగా ఉన్నాయి. మహిమలూరులో పొదుపుమహిళల సౌకర్యార్థం అప్పటి డి ఆర్డిఏ అధికారులు ఒక డ్వాక్రా భవననిర్మాణం కోసం 1.5 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఈభవనం నిర్మిస్తే మహిళలు ఏదేని సమావేశాలు జరుపుకోవ లన్నా, అధికారులతో సమీక్షలు నిర్వహించాలన్నా సౌకర్యవంతంగా ఉంటుందని భావించిన ఆగ్రామానికి చెందిన తోట వెంకటశేషయ్య, చంద్రశేఖర్, సుధాకర్, బాబులు తమ తండ్రి దివంగత తోట నాగయ్య జ్ఞాపకార్ధంగా 20అంకణాల స్థలం కేటాయించారు. భవననిర్మాణం ప్రారంభించి శాబె లెవల్కు పొదుపు మహిళల ఆధ్వర్యంలో పూర్తయింది. అనంతరం నిధుల కొరతతో నిర్మాణం నిలిచిపోయింది. ఇక అంతే నాటినుండి ఎంతగా అరిచిగీపెట్టినా ఈ భవనానికి మోక్షం లభించడం లేదు. చుట్టూరా కంప చెట్లు పెరిగి పోగా తాత్కాలికంగా ఇరుగుపొరుగువారు తమ అవసరాలకు వినియోగించుకుంటున్నారు. ఈభవననిర్మాణం పూర్తిచేసేందుకు నిధులు కేటాయించి వినియోగ ంలోకి తేవాలని పదేపదే పత్రికలు ఘోషించినా పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. గ్రామంలోకి అడుగుపెట్టగానే దర్శనమిచ్చే ఈ భవనం గురించి ప్రజాప్రతినిధులు కానీ, అధికారులు కానీ ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేనేలేవు. ఆత్మకూరు ప్రాంతంలో ఇలాంటి భవనాలు అక్కడక్కడా దర్శనమిస్తుంటా యి. సాతానుపల్లి సమీపంలో ఒక పాఠశాల భవనం, కమ్యునిటీహాల్ నిర్మించగా రెండు దశాబ్దాలుగా నిరుపయోగంగానే ఉన్నాయి. పట్టణంలో ఏసిఎస్‌ఆర్కాలనీ ప్రాంతంలో ఒక కమ్యునిటిహాల్ అలాగే ఉండగా సచివాలయానికి తాత్కాలికంగా వినియోగిస్తున్నారు. పాతజంగాలపల్లిలో పాఠశాల లేకుండా భవనం నిర్మించగా ఎలాంటి విని



యోగం లేకుండానే శిధిలమైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మహిమలూరు డ్వాక్రా భవనానికి మోక్షం కల్గించాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు.

# ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్‌కు ఘన సన్మానం

**ఐరాల, మేజర్‌న్యూస్ :** ఏపీఐఐసి డైరెక్టర్‌గా నూతనంగా నియమితులైన జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్‌కు మదన పల్లి కేంద్రంలో ఉన్న ఎంజి గ్రాండ్ నందు పూతలపట్టు జనసేన -నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా ఎం.మహేష్ స్వేరో మాట్లాడుతూ.. ఎన్నో సంవత్స రాలుగా జనసేన పార్టీకి నిస్వార్ధంగా సేవ చేస్తున్నటువంటి సీనియర్ నాయకులు జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మై పోస్ట్ మహేష్ ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమించడం శుభసూచకమని భవిష్యత్తులో ఉమ్మడి చిత్తూరు జిల్లా, పరిసర జిల్లాల్లో పారిశ్రా మిక అభివృద్ధి దిశగా అడుగులు వేయడానికి మహేష్, రెట్టింపు స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి అవ కాశం ఉందని, ఇలాంటి యువ నాయకుడికి అవకాశం కల్పించడం హర్షణీయం అని తెలి పారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా కార్య దర్శి ఏపీ శివయ్య, యాదమరి మండల అధ్య క్షులు కుమార్, యాదమరి మండల కార్యదర్శి వేముల పవన్, తవణంపల్లి మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు(చిన్న)అజిత్ శ్రీరాముల, అనిల్ కుమార్, ప్రభాకర్, టిఎన్ఎస్ ప్రసాద్, త్రినాథ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పట్ల ప్రజాధరణ పెరుగుతోంది

**తిరుపతి రెవెన్యూ, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలను కూటమి ప్రభుత్వం దగా చేస్తే, గత వైసిపి ప్రభుత్వం నిలువునా ముంచేసిందని ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం పెరుగుతోందని దీనిని గుర్తించి అందరూ కలసికట్టుగా పనిచేయాలని ఏఐసిసి కార్యదర్శి, ఆంధ్ర రాష్ట్ర ఇన్చార్జ్ గణేష్ కుమార్ యాదవ్ అలాగే పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వల్లి పిలుపునిచ్చారు. గెస్ట్ లైన్ డేస్ రోడ్ లోని ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా, అలాగే నగర కమిటీ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ నేతల వ్యక్తిగత అభిప్రాయాలను, ఎదురవుతున్న సమస్యలను, ప్రజలు పడుతున్న ఇబ్బందులను, కూటమి ప్రభుత్వంపై ప్రజల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఐసీసీ కార్యదర్శి గణేష్ కుమార్ యాదవ్, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వల్లి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు సమస్యగా మారుతోందని ఎటు చూసినా కూటమి నేతలు, వైసిపి నేతల మధ్య యుద్ధ వాతావరణం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోందని చెప్పారు. అదే సమయంలో సూపర్ సిక్స్ హామీలు అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైనట్లు ప్రజలు బహిరంగంగానే దుమ్మెత్తి పోస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో ప్రజలు రోడ్లపైకి వస్తున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు అండగా కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు నిలవాలని పిలుపునిచ్చారు. అలాగే ఓట్ చోరీపై ప్రజల సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని ఈనెల 15వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశాలు ప్రారంభానికి ముందు తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు జిల్లా, నగర నియోజకవర్గ నేతలను పరిచయం చేయగా జిల్లా అధ్యక్షుడు బాల గురవం బాబు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చింతామోహన్, పిసిసి ఉపాధ్యక్షుడు రాంభూపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ పార్టీ పిఎసి సభ్యురాలు పి. కమలమ్మ అలాగే వివిధ నియోజకవర్గాల ఇన్చార్జిలు, డివిజన్ అధ్యక్షులు, నియోజకవర్గ, రాష్ట్ర, నగర నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గిరిజన కాలనీలో అగ్నిప్రమాదం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** బ్రహ్మ దేవి గ్రామపంచాయతీలో ఆదివారం అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో కట్ట కింద కాలనీలో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిల్లు అగ్నికి ఆహుతి అయినాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ప్రమాదం జరిగినట్లు బాధితులైన రమణమ్మ, పద్మమ్మ సంయుక్తంగా తెలిపారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఫైర్ ఇంజన్‌తో వచ్చి మంటలు ఆర్పి వేయడం జరిగింది. బాధిత కుటుంబాలను రాజకీయ పార్టీల నాయకులు పరామర్శించి ఓదార్చి సాయం చేస్తామని భరోసా కల్పించారు.

## గాయత్రి దేవి అలంకరణలో మరగదాంబిక దేవి

**ఐరాల, మేజర్‌న్యూస్ :** కాణిపాకం స్వయంభూ వరసిద్ధి వినాయక స్వామి వారి అనుబంధ అలయమైన మరగదాంబిక సమేత శ్రీ మణికంటేశ్వర ఆలయంలో ఈనెల 22 సోమవారం నుంచి అత్యంత వైభవంగా జరుగు తున్న శరన్న నవరాత్రి ఉత్సవాలో భాగంగా శనివారంరాత్రి మరగదాంబి దేవి గాయత్రి దేవి అలంకరణ లో భక్తులకు దర్శనం ఇచ్చారు. తరువాత కాణిపాకం పురవీధులు గుండా అమ్మవార్లను గ్రామోత్సవం మంగళ వాయిద్యాలు నడుమ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పెంచల కిషోర్, ఆలయ ఎఈఓలు రవీంద్ర బాబు, హరిమాధవ రెడ్డి, ఎస్వీ కృష్ణా రెడ్డి,ప్రసాద్, ధనపాల్, ఆలయ సూపర్‌డెంట్లు వాసు, కోదండపాణి, తోపాటు ప్రధాన అర్చకులు ఎన్.సోమశేఖర్, అర్చకులు, వేద పండితులు, తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## మాంసం దుకాణాల్లో కమిషనర్ తనిఖీలు

**కుప్పం, మేజర్‌న్యూస్ :** కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని మాంసం దుకాణాల్లో ఆదివారం కమిషనర్ శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించారు. వన్ టైం యూసేజ్ ప్లాస్టిక్ కవర్లు ఎవరు వాడకూడదని ఎవరైనా వాడితే జరిమానాతోపాటు దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. పర్యావరణ రహిత కవర్లు వాడాలని దుకాణదారులకు సూచించారు.

# నిధులు పెంచినా ఆత్మకూరులో ముందుకుసాగని గృహనిర్మాణం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో ఏడాదిన్నరకాలంగా మంజూరైన పక్కాగృహాల నిర్మాణం పరిస్థితి చూస్తుంటే ఏమాత్రం ముందు కు సాగడం లేదు. మండలంలోఇటీవల పరిశీలిస్తే కేవలం 18.6శాతం గృహాలు మాత్రమే పూర్తికాగా 24 గృహాల పనులు ప్రారంభం కాకపోగా 352గృహాలు పునాదులకే పరిమితమై ఉన్నాయి. నుడా, పిఎంఏవై పథకాల ద్వారా ఆత్మకూరు మండలానికి 2024-25 ఆర్థిక సంవత్సరం కుగాను 569గృహాలు ప్రభుత్వం నుండి మంజూరయ్యాయి. మండలం లోని అప్పారావుపాళెంకు 6, ఆరవేడుకు 1, బండారుపల్లికి 26, బట్టే పాడుకు 34, బోయలచిరువెళ్ళకు 55, చెర్లోయడవల్లికి 45, దేపూరుకు 2, కరటంపాడుకు 59, మహిమలూరుకు 105, మురుగుళ్ళకు 21, నాగులపాడుకు 4, నల్లపురెడ్డిపల్లికి 7, నారంపేటకు 8, నువ్వురుపాడుకు 8, పడకండ్లకు 23, పమిడిపాడుకు 4, రావులకొల్లుకు 3, వాసిలికి 76, వెన్నవాడకు 5 ఇళ్ళు మంజూరయ్యాయి. అందులో 106గృహాల నిర్మాణాలు పూర్తికాగా 24 నిర్మాణాలు ప్రారంభం కాలేదు. 352గృహాలు పునాదులకన్నా తక్కువలో నిలిచిపోయి ఉన్నాయి. 35గృహాలు పునాదుల స్థాయిలో, 9గృహాలు లింటిల్‌లెవల్‌లో, 19గృహాలు రూఫ్‌లెవల్‌లో, 27గృహాలు శ్లాబ్‌లెవల్‌లో ఉన్నాయి. ప్రభుత్వం ఒక్కో గృహానికి 1.80లక్షల రూపాయలు వంతున మంజూరు చేస్తుండగా ఇటీవల అదనంగా బిసిలు, ఎస్‌సిలకు 50వేలరూపాయలు, ఎస్‌టిలకు 70వేల రూపాయల వంతున మంజూరుచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయినా గృహనిర్మాణంలో పురోగతి అత్యంత నీరసంగా కన్పిస్తోంది. కాగా మండలంలో గృహాలు మంజూరు చేయాలంటూ ఆన్‌లైన్‌లో 919మంది దరఖాస్తులు చేసుకోగా వారిలో 569మందిమాత్రమే తగిన డాక్యుమెంట్లు జతపరచగా మిగతావారు జతపరచలేదు. మండలంలోని అప్పారావు పాళెంలో ఆరుగృహాలకుగాను 2పూర్తయ్యాయి. ఆరవేడులో 1గృహంకాగా అది పూర్తయింది. బండారుపల్లిలో 26కుగాను ఒక్కటికూడా పూర్తికాలేదు. బట్టేపాడులో 34గృహాలకుగాను 3పూర్తయ్యాయి. బోయలచిరువెళ్ళలో 55గృహాలకుగాను 9పూర్తయ్యాయి. చెర్లోయడవల్లిలో 45గృహాలకుగాను 15పూర్తయ్యాయి. దేపూరులో 2ఇళ్ళకుగాను ఒక్కటికూడా పూర్తికాలేదు. కరటంపాడులో 59గృహాలకుగాను 3పూర్తయ్యాయి. మహిమలూరులో 165గృహాలకుగాను 17పూర్తయ్యాయి. మురుగుళ్ళలో 21గృహాలకుగాను ఆరు పూర్తికాగా నాగులపాడులో నాలుగు గృహాలకుగాను ఒక్కటి కూడా పూర్తికాలేదు. నల్లపురెడ్డిపల్లిలో 7గృహాలకుగాను ఐదు పూర్తయ్యాయి. నారంపేటలో 8గృహాలకుగాను ఒక్కటి కూడా పూర్తికాలేదు. నువ్వురుపాడులో 8గృహాలకుగాను నాలుగు పూర్తయ్యాయి. పడకండ్లలో 23 ఇళ్ళకుగాను 9పూర్తికాగా పమిడిపాడులో 4ఇళ్ళకుగాను నాలుగు పూర్తికాగా రామస్వామిపల్లిలో 17కుగాను ఒక్కటి, రావులకొల్లులో 3కుగాను 3, వాసిలిలో 76కుగాను 18, వెన్నవాడలో 5కుగాను 3పూర్తయ్యాయి. అర్హులందరికీ అవసరమైనన్ని గృహాలు మంజూరు చేయించేందుకు ఆత్మకూరు అభివృద్ధిప్రదాత, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సిద్ధంగా ఉండగా గృహాలను వెంటనే ప్రారంభించి పనులు పూర్తిచేయాలని పదేపదే అధికారులు కోరుతున్నా ఆత్మకూరు మండలంలో గృహనిర్మాణం అత్యంత నత్తనడకన సాగుతోంది. మరి పురోగతి లభిస్తుందో లేదో చూడాల్సి ఉంది. అదీగాక లబ్దిదారులకు గతంలో లేఅవుట్‌లలో స్థలాలు కేటాయించి ఉన్నా వారు స్వంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయినా లక్ష్యసాధనలో ఫలితం నిరాశాజనకంగా ఉంది.

# ములుమూడిలో ఏపీ రైతు సంఘం జిల్లా 14వ మహాసభ





**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా 14వ మహాసభ నెల్లూరు రూరల్ మండలంలోని ములుమూడి గ్రామంలో నిర్వహించారు. ఈ మహాసభకు అధ్యక్షులుగా పి.శ్రీరాములు, గోపసానీ రమేష్, ఓడూరు వెంకట కృష్ణయ్యలు వ్యవహరించారు. మహాసభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణలు మాట్లాడుతూ.. 2014 సంవత్సరంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, మేము అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపుచే రైతుల ఆత్మహత్యలను నిలుపుదల చేస్తామని, అనేక రకాల వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగనికి వ్యతిరేకమైన 3 నల్ల చట్టాలను తెచ్చారనీ. వాటికి వ్యతిరేకంగా రైతాంగం కార్మిక వర్గాన్ని కలుపుకొని 13 నెలల పాటు వీరోచితమైన పోరాటం చేసి కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి ఆ చట్టాలను రద్దు చేయించిన చరిత్ర మన రైతాంగానికి ఉందనీ అన్నారు. ఈ మహాసభలో కొన్ని తీర్మానాలను చేయడం జరిగినది. 1.దెబ్బతిన్న సోమశిల ఆప్రాన్‌ను వెంటనే పూర్తి చేయాలని, 2.పెన్నా పొర్లు కట్టలకు రివిట్మెంట్ చేయాలని, 3.జిల్లాలో బలవంతపు భూసేకరణను ఆపుదల చేయాలని, 4.అసంపూర్తిగా ఉన్నసోమశిల హై లెవెల్ కెనాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని, 5.వెలిగొండ ప్రాజెక్టులో భాగంగా పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ ను పూర్తి చేయాలని 6.రైతులు పండించిన పంటలకు ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని, 7.సకాలంలో రైతాంగానికి యూరియా అందించాలని, 8. రీసర్వేలో వచ్చిన రెవెన్యూ సమస్యలను పరిష్కారం చేయాలని తీర్మానం చేయడం జరిగింది. మహాసభ అనంతరం 30 మందితో నూతన కమిటీని, 11 మందితో ఆఫీస్ బేరర్స్‌ని ఎన్నుకొని అధ్యక్ష కార్యదర్శులుగా పూడిపర్తి జనార్ధన్, మూలివెంగయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆఫీస్ బేరర్స్‌గా పి.శ్రీరాములు చంద్ర రాజగోపాల్, మూలం రమేష్, ఓడూరు వెంకటకృష్ణయ్య, గుర్రం వెంకటేశ్వర్లు, గండవరపు శ్రీనివాసులు, లక్కు ప్రసాద్, కాకు వెంకటయ్య, గోపసాని రమేష్‌లను ఎన్నుకోవడం జరిగింది.


# యాదవ కులంపై దౌర్జన్యం

- గ్రామంలో యాదవ కులస్తులపై అగ్రవర్ణాల దాడి
- యాదవులు మాట్లాడితే చంపేస్తాం అంటూ బెదిరించిన కమ్మ నాయకులు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం తిమ్మసముద్రం గ్రామంలో యాదవ్ కులస్తులపై గ్రామానికి చెందిన కమ్మ నాయకులు దౌర్జన్యానికి దిగిన సంఘటన శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జలదంకి మండలం తిమ్మసముద్రం గ్రామంలో గతంలో యాదవ్ కులస్తుల పై కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకులు దాడికి పాల్పడిన సంఘటనలు ఉన్నాయి ఇటీవల గ్రామంలోని శిరీష లావణ్యలపై కమ్మ సామాజిక వర్గానికి చెందిన వేణు గోపాల్, లక్కీ(సుమంత్) మహిళలు అనే విశిక్షణ లేకుండా దాడికి పాల్పడి గొల్ల కులం అంటూ పర్సు పదజాలంతో విక్షణ రహితంగా మాట్లాడుతూ.. దాడికి పాల్పడ్డారు. కులం పేరుతో నిందిస్తూ మీకు దిక్కున చోటు చెప్పుకోండి అని బెదిరించి బ్రయ బ్రాంతులకు గురిచేశారు. ఈ విషయంపై బాధితులు దేవరాల శిరీష, లావణ్యలు జలదంకి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన కేసు నమోదు చేయలేదు అయితే కమ్మ సామాజిక వర్గానికి చెందిన బాధితులపై దాడి చేసిన రాజగోపాల్, సుమంత్ లక్కీలు జలదంకి పోలీస్ స్టేషన్లో తమను వారే కొట్టారని ఫిర్యాదు చేశారు. దీంతో జలదంకి ఎస్ఐ లతీపున్నిసా ఎటువంటి విచారణ లేకుండా ముందుగా కేసు పెట్టిన బాధితులు గురించి పట్టించుకోకుండా కమ్మ సామాజిక వర్గానికి అనుకూలంగా బాధ్యతలపై కేసు నమోదు చేసినట్లు తిమ్మసముద్రం గ్రామానికి చెందిన యాదవ్ కులస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపైగత రెండు రోజులుగా జలదంకి పోలీస్ స్టేషన్లో పంచాయతీ నడుస్తుంది. ఏది ఏమైనా బాధ్యతలకు అండగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, పోలీస్ అధికారులు నిలవాల్సిందిగా, జిల్లా యాదవ సంఘం కులస్తులు కోరుతున్నారు.

# ఈసీజన్‌లోనైనా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణం మున్సిపాలిటీ అన్నపేరేకానీ జనాల అవస్థలు గురించి అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. మున్సిపల్ కేంద్రంగా ఉన్న ఆత్మకూరులో కోతులు, కుక్కలు, గోమాతల బెడద తీవ్రంగా ఉంటూ జనాలు ఆందోళనకు గురవుతూ తరచూ ఇబ్బందిపడుతున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలో డ్రైనేజి వ్యవస్థ అస్థవ్యస్థంగా ఉండడం, పట్టణ మధ్యలో పంటకాలువలు కూడా ఉండడంతో దోమలు విపరీతంగా ఉన్నాయి. జనాలు మెష్‌లు, దోమతెరలు తదితర ఎంతగా నివారణ చర్యలు చేపడుతున్నా దోమలు తగ్గడం లేదు. ఏళ్ళతరబడి పట్టణంలో బ్లీచింగ్ చల్లడం కానీ, ఫాగింగ్ చేయించడం కానీ, మలాథియాన్ పిచికారి చేయించడం కానీ లేనేలేదు. మున్సిపాలిటీలో ఏళ్ళ తరబడి దోమల నివారణకు మున్సిపాలిటీ తరపున చర్యలు లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తుంటారు. మున్సిపాలకులు ఈ దోమల నివారణ గురించి ఏమాత్రం ఆలోచించి కౌన్సిల్ సమావేశాల్లో చర్చించిన దాఖలాలు లేవు. అధికారులు కూడా ఈవిషయమై నిర్లక్ష్యంగా ఉన్నారన్న విమర్శలు అధికంగా ఉన్నాయి. వర్షాలు అడపాదడపా కురుస్తుండడంతో దోమలు పెచ్చుపెరిగిపోతున్నాయని,. అధికంగా జనాలకు జ్వరాలు సోకుతున్నాయని, అందరూ తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని సర్వత్రా వాపోతున్నారు. ఎవరైనా ప్రముఖులు పర్యటించే సందర్భంగా రోడ్లపై బ్లీచింగ్ దర్శనమిస్తుందే తప్ప పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించే పరిస్థితి లేదు. గతంలో ఫాగింగ్ చేయించడం, బ్లీచింగ్ చల్లించడం, మలాథియాన్ పిచికారి చేయించడం జరుగుతుండేది. నాలుగేళ్ళుగా అలాంటి పరిస్థితి లేదని సర్వత్రా



విమర్శిస్తున్నారు. పాలకులపై కూడా విమర్శలు తీవ్రంగానే ఉన్నాయి. పట్టణంలో ప్రజారోగ్యం పరిరక్షించాలనికానీ, దోమలు నివారించాలనికానీ, తీవ్ర ఇబ్బందికరంగా ఉన్న కోతులు, గోమాతల బెడద తప్పించాలని కానీ మున్సిపాలకులు ఏనాడూ యోచించడంకానీ, చర్యలు తీసుకోవాలని కోరడం కానీ జరగనేలేదు. ఏదో కౌన్సిల్ సమావేశాలు జరిగినసమయంలో తూతూమంత్రంగా మాట్లాడుతుంటారే తప్ప ఇలాంటి సమస్యలగురించి చర్చించే పరిస్థితి కానరావడం లేదు. అసలే పట్టణంలో డ్రైనేజి అస్థవ్యస్థంగా ఉంటుంది. పంటకాలువలు కూడా మురుగుకాలువలను తలపిస్తుంటాయి. దాంతో దోమలు విపరీతంగా ఉత్పత్తి అవుతున్నాయి. వాటి బెడద రోజురోజుకూ పెరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్న విమర్శలు అధికంగా ఉన్నాయి. మరి పాలకులు, అధికారులు స్పందిస్తారేమో చూడాల్సి ఉంది.

# ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

- కేవీఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్ ప్రారంభం



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్టోన్ హౌస్ పేట జలకన్య బొమ్మ దగ్గర కేవీఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్ నందు ఆదివారం ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం జరిగింది. ముందుగా కేవీఆర్ గ్రాండ్ మినీ ఫంక్షన్ హాల్‌ను టీడీపీ నాయకులు ఆనం రంగ మయూర్‌రెడ్డి, మామిడాల మధు, జనసేన సీనియర్ నేత నూనె మల్లికార్జున యాదవ్, విద్యావేత్త నేతాజీ సుబ్బారెడ్డి ప్రారంభించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య శ్రీనివాస కళ్యాణ మహొత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పొన్నాల అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకొని అందుబాటులో ఉండేలా ఈ ఫంక్షన్ హాల్‌ను రూపొందించామన్నారు. 300మంది సీటింగ్ కలిగిన ఫంక్షన్ హాల్ ఉందని వివాహాది శుభ కార్యాలు జరుపుకునేందుకు అనువుగా ఉందన్నారు. తమ ఫంక్షన్ హాల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బంధుమిత్రులు పాల్గొన్నారు.

# అందని రుణాలు సబ్సిడీ రుణాలు

- 10 నెలలుగా పడిగాపులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, ఇతర కార్పోరేషన్ల ద్వారా ఆర్ధికంగా వెనుకబడిన వారి జీవనోపాధికోసం సబ్సిడితో రుణాలు మంజూరు చేసేలా ప్రభుత్వం నిర్ణయించగా అనేకమంది దరఖాస్తులు చేసుకోగా ప్రభుత్వం నుండి సబ్సిడి విడుదల కానందున ఎంపికైన వారికి ఈనాటికీ రుణాలు అందలేదు. ఈఏడాది జనవరిలో అధికసంఖ్యలో స్వయం ఉపాధికోరే యువతీ, యువకులు ఆన్‌లైన్‌లో అన్ని ధృవీకరణలతో దరఖాస్తులు చేయగా వారికి ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన కార్పోరేషన్ వారీగా లక్ష్యంమేరకు ఈ దరఖాస్తుదారులనుండి ఎంపికచేసి ఆయా బ్యాంకులకు పంపారు. అయితే ప్రభుత్వం నుండి బ్యాంకులకు సబ్సిడి నిధులు విడుదల కాలేదు. దాంతో బ్యాంకర్లు రుణాలను లబ్ధిదారులకు మంజూరుచేయడం లేదు. ప్రభుత్వం నిర్ధేశించిన రుణం మొత్తంలో 50శాతం సబ్సిడిగా విడుదలచేయాల్సి ఉంది. కానీ పదినెలలు గడిచినా ఇంకా ప్రభుత్వం నుండి బ్యాంకులకు సబ్సిడి నిధులు విడుదల కాలేదు. ఆత్మకూరు మండలంలో 46మందికి 50శాతం సబ్సిడితో బ్యాంకులనుండి రుణాలు పొందేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించి ఆదేవాలివ్వగా అధికారులు దరఖాస్తులు స్వీకరించి ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపికచేశారు. ఆత్మకూరు రూరల్ మండలంలో 3రకాలుగా 2లక్షలు నుండి 5లక్షల వరకు ఈరుణాలుంటాయని, బిసి కార్పోరేషన్ ద్వారా 30 మందికి, బ్రాహ్మణ కార్పోరేషన్‌ద్వారా ఒక్కరికి, రెడ్డి కార్పోరేషన్ ద్వారా ముగ్గురికి, ఇబిసి కార్పోరేషన్ ద్వారా ఇద్దరికి, కమ్మకార్పోరేషన్ ద్వారా ఇద్దరికి, ఆర్యవైశ్యకార్పోరేషన్ ద్వారా ఒక్కరికి, చంద్రన్న స్వయంఉపాధి పథకంద్వారా కాపులు 5మందికి, జనరిక్‌మందులషాపు ఏర్పాటుకు కమ్మ కార్పోరేషన్ ద్వారా ఒక్కరికి, ఆర్యవైశ్యకార్పోరేషన్ ద్వారా ఒక్కరికి సబ్సిడితో బ్యాంకుల నుండి రుణాలు మంజూరవుతాయని ప్రభుత్వం నుండి ఆదేశాలందాయి. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో బిసికార్పోరేషన్ 41 మందికి, కాపు కార్పోరేషన్ నలుగురికి, ఆర్యవైశ్య కార్పోరేషన్ ఒక్కరికి, క్షత్రియకార్పోరేషన్ ద్వారా ఒక్కరికి మొత్తం 47మందికి రుణలిచ్చేలా ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించారు. ఆమేరకు మండలంలో ఎండివో, మున్సిపాలిటీలో కమీషనర్‌లు అన్నిబ్యాంకుల ప్రతినిధులతో అభ్యర్ధులకు ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపికచేసి ఆయా బ్యాంకులకు వారి దరఖాస్తులను పంపారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు సబ్సిడిని విడుదల చేయనందున నెలలతరబడి జాప్యం జరుగుతుండగా రుణాలకు ఎంపికైన వారు ఆతృతగా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇంకా జాప్యం జరుగుతుందా లేక గతంలోలాగా రద్దవు తాయా అని వారంతా చర్చించుకుంటున్నారు. గతంలో తెలుగుదేశం హయాంలో ఇలాగే కార్పోరేషన్‌ల ద్వారా సబ్సిడి రుణాలకు దరఖాస్తులు, ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారులను ఎంపికచేయగా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చి ఆరుణాలన్నింటిని రద్దుచేశారు. ఇక ఐదేళ్ళు కార్పోరేషన్‌రునాల ఊపే లేదు. కాగా ఈదపా తెలుగుదేశం ప్రభుత్వం రావడం, కార్పోరేషన్‌రుణాలు పునరుద్ధరించడం, ఆమేరకు దరఖాస్తులు, ఇంటర్వ్యూలు, ఎంపికల ప్రక్రియ పూర్తికాగా ప్రభుత్వం సబ్సిడి విడుదల చేయనందున రుణాల మంజూరు నిలిచిపోయి ఉంది. ప్రభుత్వం వెంటనే పరిశీలించి సబ్సిడి విడుదల చేయాలని లబ్దిదారులుగా ఎంపికైనవారు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు వ్యాసరచన పోటీలు





**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు 14 డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పది గంటలకు వికాస్ హై స్కూల్లో పోటీలు నిర్వహించడం జరిగింది. మహిళలు పరిసరాల పరిశుభ్రత గురించి ఈ వ్యాచారచన పోటీల్లో పాల్గొన్నారు. మహిళలు కొంతమంది ఇంగ్లీషులో కొంతమంది తెలుగులో రాశారు. వారికి వేరువేరుగా బహుమతి ప్రధానం ఉంటుందని కర్తం పేర్కొన్నారు. మరో 20 మందికి ప్రోత్సహిక బహుమతులు ఉంటాయన్నారు. వచ్చే ఆదివారం వీరందరికీ ముఖ్యఅతిథులు చేతులమీదుగా బహుమతి ప్రధానం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కర్తం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. 14 డివిజన్లో ఒకరోజు ఒక వీధి పరిశుభ్రములో భాగంగా డివిజన్లో చాలా వరకు వీధులు శుభ్రం చేయడం జరిగిందన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడానికి మహిళలకు పరిసరాల పరిశుభ్రత గురించి వ్యాసరచన పోటీ నిర్వహించడం జరిగిందన్నారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారన్నారు. వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ప్రజలందరికీ పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాంఅని అన్నారు. ప్రజలందరూ కూడా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రోడ్లమీద చెత్త వేయకుండా ట్రాక్టర్ వచ్చినపుడు మాత్రమే ఆ బండిలో వేయవలసిందిగా కోరారు. దోమల నివారణకు పవర్ స్ప్రే ద్వారా దోమల మందు పిసికారి చేయడం జరుగుతుంది. ఆయిల్ బాల్స్, ఫాగింగ్ చేయించడం జరుగుతుందన్నారు. అలాగే రోడ్డుమీద గడ్డిని చెక్కించడం కాలువల్లో షీల్డ్ తీయించడం ఇలాంటి కార్యక్రమాలు చేపతున్నారని కర్తం అన్నారు.

## టపాసులు దుకాణాలకు
# అనుమతులు లేకుంటే సీజ్ చేస్తాం

▶ చిన్నబజార్ సీఐ చిట్టెం కోటేశ్వరరావు హెచ్చరిక



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని చిన్నబజారు సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రానున్న దీపావలి పర్వదినం సందర్భంగా టపాకాయల దుకాణాలకు అనుమతులు తప్పనిసరి అని చిన్నబజారు సీఐ చిట్టెం కోటేశ్వరరావు స్పష్టం చేశారు. అనుమతి లేని దుకాణాలను తప్పనిసరిగా సీజ్ చేస్తామని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా దృష్ట్యా టపాకాయల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు చిన్నబజారు సర్కిల్ పరిధిలో పేరుగాంచిన టపాకాయల దుకాణాలను విస్తృత తనిఖీ చేపడుతున్నట్లు తెలియజేశారు. దుకాణాల్లో పరిమితికి మించి సరుకు ఉన్నా.. వ్యాపారస్తుల ఇళ్లల్లో అక్రమంగా సరుకు నిల్వ చేసుకున్నా.. చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ప్రజల భద్రతా దృష్ట్యా టపాకాయల వ్యాపరస్తులు ముందస్తు అనుమతులు తీసుకుని ప్రభుత్వ నిబంధనల మేరకే వ్యాపారాలు సాగించాలని, అందుకు పోలీసులకు వ్యాపారస్తులందరూ సహకరించాలని కోరారు.


## ప్లాస్టిక్ కవర్ల తగ్గింపుకు మార్కెట్ నిర్వాహకులు నిర్ణయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్లాస్టిక్ కవర్లను తగ్గించి క్లాత్‌కవర్లను వినియోగదారులకు అలవాటుచేసేలా ఆత్మకూరులోని కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారులు నిర్ణయించారు. ఎవరైనా కూరగాయలకోసం వచ్చేవారు తమవెంట కాటన్‌గుడ్డతో తయారైన సంచిని తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. అలా తెచ్చుకొనకుంటే 20 రూపాయలు చెల్లిస్తే తామే సంచిని సమకూరుస్తామని చెబుతున్నారు. ప్లాస్టిక్ కవర్లను నిరోధించేలా ఈ నిర్ణయం తీసుకున్నామని వారు చెబుతున్నారు. మున్సిపల్ అధికారుల ఆదేశాలమేరకు ఈనిర్ణయం తీసుకున్నామని వారు పేర్కొన్నారు. ప్రజలంతా గమనించి సహకరించాలని, కూరగాయలకోపం వచ్చేటపుడే క్లాత్‌సంచులను తెచ్చుకోవాలని, లేదంటే 20రూపాయలు చెల్లించి తమవద్ద సంచి కొనుగోలు చేసుకోవాలని, అందరూ ఈనిర్ణయానికి సహకరించాలని, ప్లాస్టిక్ నిరోధంకు అందరూ సహకరించాలని వ్యాపారులు కోరుతున్నారు. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం అనర్ధదాయకమన్న విషయాన్ని అందరూ అవగాహన చేసుకోవాలని, క్లాత్‌సంచులను వినియోగించాలని వారు కోరుతున్నారు.

# నెల్లూరులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం





**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో 42వ డివిజన్ ఇన్‌చార్జ్ షేక్ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్ వలి, సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డిలు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మస్తాన్ వలి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం ఒక్క కాంగ్రెస్ పార్టీ ద్వారానే సాధ్యమవుతుందని తెలియజేశారు. దేశవ్యాప్తంగా బిజెపి హామీలను నమ్మి ప్రజలు ఆ పార్టీకి ఓటు వేస్తే నిండా మోసం చేశారన్నారు. దేశంలో రైతాంగం అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అనంతరం సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తెలుగుదేశం నాయకులు కల్తీ మద్యం తయారీలో పోటీ పడడం చూసి ప్రజలు అసహ్యించుకుంటారున్నారని, మెడికల్ కళాశాలలకు సంబంధించి వైసీపీ నేతలు సంతకాల సేకరణ దేనికొరకూ చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో అధికారంలోకి వస్తేనే, ప్రత్యేక హెూదా అమలుతో ఈ రాష్ట్రం బాగుపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్, నేతల సుధీర్, షఫీ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు సిటీపై కాకాణి ప్రత్యేక దృష్టి

**పార్టీని మరింత బలోపేతం చేయడంపై చర్చలు**
**జిల్లా కేంద్రంలో కార్యక్రమాలు మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళిక**



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరులో డైకాస్ రోడ్డు లోని. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డితో ఆదివారం వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇన్‌చార్జ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు పలు విషయాలు చర్చించుకున్నారు. గత ఒకటిన్నర సంవత్సరాలుగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనేక కార్యక్రమాలు చేపట్టటంతోపాటు పార్టీ మరింత బలపడిందని ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కాకాని సూచించారు. డివిజన్ స్థాయిలో పార్టీని మరింత బలంగా తీర్చిదిద్దాలన్నారు. రాబోయే కార్పొరేషన్, స్థానిక సంస్థలకు సంబంధించి కాసేపు చర్చించారు.

# జీఎస్ఆర్ క్రికెట్ టీం జట్టుకు ప్రధమ బహుమతి




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఆర్‌వైఎస్ సీజన్-6 ముత్తుకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో ప్రథమ బహుమతిని జీఎస్ఆర్ క్రికెట్ టీం జట్టు(గంటా సాంబశివరావు) సాధించింది. టోర్నమెంట్ పోటీలు విజయవంతంగా ముగియడం జరిగింది. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, కృష్ణపట్నం పోర్టు అధికారులు మృత్యుంజయ రామ్, అదానీ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ సంయుక్తంగా ప్రథమ బహుమతిని ఆ టీంకు అందజేసినట్లు టోర్నమెంట్ నిర్వాహకులు యల్లం గారియల్లయ్య, కోడూరు రవి, సుధాకర్ సంయుక్తంగా ఆదివారం తెలిపారు. రెండవ బహుమతిని పీఎస్పీ జట్టు కైవసం చేసుకున్నట్లు తెలియజేశారు. క్రీడా మైదానం అభివృద్ధి పనులకు సహకరిస్తున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కృష్ణపట్నం పోర్ట్ అధికారులకు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలుపుతున్నామని నిర్వాహకులు తెలిపారు.